క్లుప్తంగా

పథకాల సొమ్ము జమ



శిరివెళ్లలో డ్రా చేసిన నగదును లెక్కిస్తున్న మహిళ

శిరివెళ్ల: పోలింగ్ ముగిసిన అనంతరం సంక్షేమ పథకాల సొమ్మును ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలో జమ చేసింది. ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం వంటి పథకాల నగదు వరుసగా జమవుతోంది. దీంతో మహిళలు బ్యాంక్‌లకు తరలివచ్చి తమ నగదును డ్రా చేసుకుంటున్నారు. ఎన్నికల కోడ్‌కు ముందు ఆసరా కింద డ్వాక్రా సంఘాల మహిళలకు 80 శాతం పైగా రుణమాఫీ సంఘాల ఖాతాలో జమైంది. మిగిలినది శాతం కోడ్‌తో ఆగిపోయింది. గత ఇదారు రోజుల నుంచి ఆసరా చివర విడత నగదు 15 శాతం నగదు జమైంది. అలాగే చేయూత, ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు నగదు జమ కావడం మొదలు కావడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీ జీలుగలకు రిజిస్ట్రేషన్ ప్రారంభం



దీబగుంట్లలో జీలుగ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది

గోస్పాడు: ప్రభుత్వం అందించే సబ్సిడీ జీలుగలకు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటున్నారని, 50శాతం సబ్సిడీతో జీలుగలను అందజేస్తున్నట్లు చెప్పారు. 10 కేజీల ధర మార్కెట్‌లో రూ.880 ఉండగా 50శాతం సబ్సిడీ పోనూ రూ.440 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు అవసరమయ్యే రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఘనంగా నరసింహ స్వామి జయంత్యుత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో గుట్టకొండ లక్ష్మీ నరసింహ స్వామి

రుద్రవరం: మండల కేంద్రానికి సమీపం, నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన గుట్టకొండ లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించారు. అనంతరం అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సమక్షంలో పండితులు వేద మంత్రోచ్ఛారణలతో స్వామి వారి జయంతి, హోమాది పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు.

కొనసాగుతున్న వ్యవసాయాధికారుల తనిఖీలు

నంద్యాల(అర్బన్): ఖరీఫ్ పంటల సాగులో నాణ్యత లేని విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయాధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో చేపట్టిన తనిఖీలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని కిరణ్ హైబ్రీడ్స్, ధరణి సీడ్స్‌లో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిస్టార్, బిల్‌బుక్స్, పత్రాలను ఏఓ ప్రసాదరావు పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో విత్తన నమూనాలను నాణ్యత ప్రమాణాల కోసం ప్రయోగశాలకు పంపారు.

మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

కల్లూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో జూనియర్ ఇంటర్‌లో మిగిలిన సీట్లకు బుధవారం చిన్నటేకూరు గురుకుల కళాశాలలో బాలురకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి తెలిపారు. చిన్నటేకూరు, సి.బెళగల్, జూపాడుబంగ్లా, అరికెర గురుకుల కళాశాలలో మిగిలిన 248 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించగా 211 సీట్లు భర్తీ అయ్యాయి. చిన్నటేకూరు, సి.బెళగల్, జూపాడుబంగ్లా కళాశాలల్లో సీట్లన్నీ భర్తీ అయ్యాయి. అరికెర కళాశాలలో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు ప్రవేశ పరీక్షలో పొందిన మార్కుల మెరిట్ ప్రకారం సీట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. చిన్నటేకూరు ఐఐటీ-నీట్ అకాడమీ డైరెక్టర్/ప్రిన్సిపల్ రామసుబ్బారెడ్డి, సి.బెళగల్, జూపాడుబంగ్లా, అరికెర కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

రంగు చూసి మోసపోకు!

- మామిడి మాటున విషం
- పక్వానికి రాకముందే మాగపెడుతున్న నిర్వాహకులు
- జోరుగా నిషేధిత రసాయనాల వినియోగం
- క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు వచ్చే ప్రమాదమందంటున్న వైద్యులు



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మామిడి పండ్లు

నంద్యాల(వ్యవసాయం): మేలిమి పసిడి వర్ణంలో మెరిసిపోతున్న మామిడి పండును చూడగానే తినాలనిపిస్తుందా..అయితే ఒక్క నిమిషం ఆగండి. అది సహజసిద్ధంగా మాగిందా.. లేదా రసాయనాలతో మాగబెట్టారా తెలుసుకొని కొని తినండి. ప్రస్తుతం మార్కెట్‌లో మామిడి పండ్లు విస్తారంగా లభిస్తున్నాయి. అయితే త్వరగా మాగబెట్టేందుకు వ్యాపారులు కార్బైడ్ వంటి రసాయనాలు ఉపయోగిస్తున్నారు. ఫలితంగా క్యాన్సర్, ఇతర జీర్ణకోశ, చర్మవ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే మార్కెట్లో కుప్పలుగా ఉన్న కాయల్లో ఏది సహజ సిద్ధంగా మాగిందో, వేటిని రసాయనాలు ఉపయోగించి మాగించారో చాలా మంది తెలుసుకోలేక పోతున్నారు.

జిల్లాలో రూ.150 కోట్లకు పైగా వ్యాపారం..

నంద్యాల జిల్లాలో మామిడి పండ్ల సీజన్ వచ్చిందంటే రూ.150 కోట్లు వ్యాపారం జరుగుతుంది. జిల్లాలో 9,250 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేస్తున్నారు. బనగానపల్లె, బేతంచర్ల, వెలుగోడు, డోన్, బండిఆత్మకూరు, పాణ్యం, మహానంది, ఆళ్లగడ్డ, గడివేముల తదితర మండలాల్లో మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయి. ఏటా వేసవి కాలంలో ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలు కర్ణాటక, మహారాష్ట్ర, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాలకే కాకుండా ఇతర దేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయి. ఎక్కువగా బేనీసా, హిమాయత్, దిల్‌పసంద్, మల్లుబా, రెడ్ పసంద్, అమృతాలు, నాజుక్, లంగడ, కేసరి, దసరి, ఆల్ఫోన్స్, చిత్తూరు మామిడి, యంబాయి, చిన్నరసాలు, ఖాదర్, మితుషా తదితర రకాల పండ్లు ఇక్కడ సాగవుతున్నాయి.

రంగును బట్టి..

కృత్రిమంగా మాగిన వాటిని గుర్తించడానికి పరిశీలించాల్సిన అంశాల్లో మొదటిది.. కాయ రంగు రసాయనాలు ఉపయోగించి మగ్గబెట్టిన పండ్లు చూడటానికి పసుపురంగులోనే ఉన్నా వాటిపై ఆకుపచ్చ మచ్చలు కనిపిస్తుంటాయి. మరికొన్నింటిలో సహజ సిద్ధంగా మాగినప్పుడు వచ్చే రంగు కంటే మరింత ప్రకాశవంతంగా కనిపిస్తుంది. సహజసిద్ధంగా పక్వానికి వచ్చిన పండ్ల రంగు అంతా ఒకేలా ఉంటుంది.

వాసన ఆధారంగా..

సహజసిద్ధంగా మాగిన మామిడి నుంచి వచ్చే వాసన మధురంగా, తియ్యగా ఉంటుంది. కార్బైడ్ ఉపయోగించి మగ్గబెట్టిన పండ్ల నుంచి ఘాటైన వాసన వస్తుంటుంది. కొన్ని సందర్భాల్లో పండ్ల నుంచి ఎటువంటి వాసన రాకపోవడం కూడా గమనించవచ్చు. పండ్ల రుచి ఆధారంగా కూడా కొనుక్కోవచ్చు. పండ్లు కొనుగోలు చేసేటప్పుడు అవి ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి శాంపిల్ ముక్కను తినడం సహజమే. దీని ద్వారా కూడా సహజమైదా కాదా అన్న విషయాన్ని గ్రహించవచ్చు. సాధారణంగా కృత్రిమంగా మగ్గబెట్టిన పండును తింటునప్పుడు నోరు, గొంతులో మంట పెడుతున్నట్లుగా అనిపిస్తుంది. ఇలాంటివి తిన్న కొంత సమయం తర్వాత చాలా మందిలో కడుపునొప్పి, డయేరియా వంటివి వచ్చే అవకాశం ఉంది. అదే సహజ సిద్ధమైన పండు అయితే ఇలాంటి లక్షణాలు ఏవీ కనిపించవు. రుచిగా, తియ్యగా ఉంటుంది.



రిఫైనింగ్ చాంబర్‌లో మామిడి పండ్లను కృత్రిమంగా మాగబెడుతున్న దృశ్యం

మగ్గబెట్టిన పండు..

కొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు మాలిగల కోసం ఇళ్లను అద్దెకు తీసుకొని రసాయనాలు ఉపయోగించి మామిడి పండ్లను మగ్గబెట్టి వాటిని త్వరగా అమ్మకాలు జరుపుతుంటారు. ఈ విధంగా వాడే మామిడి పండు వల్ల ఆరోగ్యానికి హాని కలిగి అనారోగ్యం పాలవుతాం. తప్పని పరిస్థితుల్లో అటువంటి మామిడి పండ్లను కొనాలనిపిస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దీని కోసం ఒక టబ్బు నిండా మంచి నీరు పోసి దానిలో గుప్పెడు ఉప్పు వేసి మామిడి పండ్లను అరగంటసేపు ఉంచాలి. తర్వాత వాటిని ఉపయోగికుంటే కొంత వరకు అనారోగ్య సమస్యలను నివారించవచ్చు.

రిఫైనింగ్ యూనిట్ల ద్వారా మగ్గబెట్టడం...

శాస్త్రీయ పద్ధతిలో రిఫైనింగ్ యూనిట్ల ద్వారా మామిడి కాయలను మొదటి రోజు ఏసీల ద్వారా 20 నుంచి 24 సెంటిగ్రేడ్ వద్ద వాటిని శీతలీకరించి తర్వాత రోజు నుంచి మూడు రోజుల పాటు ఇథలిన్ గ్యాస్‌ను పంపి కాయలను మగ్గిస్తారు. ఈ కాయ పండుగా మారడానికి నాలుగురోజుల సమయం పడుతుంది. ఇది శాస్త్రీయమైన పద్ధతి అని, ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలకు గురిచేయదని ఉద్యానవన శాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

అధికారులు అవగాహన కల్పించాలి



వ్యాపారులు కృత్రిమంగా మగ్గబెట్టి వాటిని అమ్మే ప్రయత్నం చేస్తుంటారు. వీటిని అరికట్టాల్సిన బాధ్యత అధికారులదే. ఉద్యానవన శాఖ అధికారులతో గుర్తింపు పొందిన రిఫైనింగ్ సెంటర్లలో సహజ సిద్ధంగా మగ్గబెట్టిన పండ్లను తినడం ద్వారా ఎటువంటి అనారోగ్యాలు రావు. అధికారులు వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పించాలి. – అల్తాఫ్, రిఫైనింగ్ చాంబర్ యజమాని, నంద్యాల

కార్బైడ్‌తో అనర్థాలు



ఎన్నో అనర్థాలకు దారి తీసే కార్బైడ్‌తో మామిడి పండ్లను మగ్గించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వీటితో మగ్గించిన పండ్లను తినడం వల్ల జీర్ణకోశ, చర్మవ్యాధులు, కళ్ల నుంచి నీరు కారడం, మతిమరుపు వంటి లక్షణాలు, కాలేయం, మూత్రపిండాలు సక్రమంగా పని చేయకపోవడం, క్యాన్సర్ వంటి రోగాలకు గురవుతారు. సహజ సిద్ధంగా పక్వానికి వచ్చిన పండ్లను మాత్రమే తినాలి.

– డాక్టర్ వెంకటరమణ, డీఎండ్‌హెచ్‌ఓ, నంద్యాల

కౌంటింగ్ కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్ఓ మల్లికార్జునరెడ్డి

ఆళ్లగడ్డ: ఓట్ల లెక్కింపు సమయంలో ఆయా పార్టీల కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలని రిటర్నింగ్ అధికారి మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉన్నందును రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు గానీ బహిరంగ ప్రదేశాల్లో గుమికూడి ఉండరాదన్నారు. కౌంటింగ్‌లో పాటించాల్సిన నిబంధనలు పార్టీ నాయకులకు అందజేస్తామన్నారు. వాటిని అనుసరించి కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు వ్యవహరించాల్సి ఉంటుందని చెప్పారు. వాటిని పాటించని ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రాల నుంచి బయటకు పంపివేయడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించండి

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు
- నెట్‌వర్క్ హాస్పిటళ్ల యాజమాన్యాలతో సమావేశం
- అత్యవసర చికిత్సలు నిలిచిపోరాదని సూచన

నంద్యాల: నెట్ వర్క్ హాస్పిటళ్లలో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత యాజమాన్యాలకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్‌లో నెట్ వర్క్ హాస్పిటళ్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రాణాపాయ, అత్యవసర కేసులకు ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్సలు అందించాలని యాజమాన్యాలను కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల బకాయిలన్నింటినీ ప్రభుత్వం త్వరలో చెల్లిస్తుందన్నారు. అత్యవసర కేసులకు సంబంధించిన చికిత్సలకు ఆటంకం కలగకుండా మానవతా దృక్పథంతో వ్యవరించాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ రూపేంద్రనాథరెడ్డి, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ జఫరుల్లా, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వరప్రసాద్, హాస్పిటళ్ల యాజమానులు పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశ్వర, లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం







సువర్ణరత్న ఆభరణ అలంకారంలో వేంకటేశ్వరస్వామి, శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు , తిలకిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయం, తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయాల వార్షికోత్సవాలను పురస్కరించుకొని బుధవారం స్వామి వార్ల కల్యాణోత్సవాలను కమనీయంగా నిర్వహించారు. స్థానిక సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, విశ్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం, నవకుంభారాధన, రక్షా బంధనం, వేద అధ్యాయనం, అగ్నిప్రతిష్ట హోమం , మూలమంత్ర హోమాలు జరిపించి, విశేష పూలంగిసేవ కార్యక్రమం అనంతరం వేంకటేశ్వరస్వామి వారిని సువర్ణ రత్నాభరణాలతో అలంకరించి సామూహిక విష్ణుసహస్ర నామ పూజా కార్యక్రమాన్ని చేయించారు. చివరగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం చేపట్టారు. అలాగే.. శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి కల్యాణం పండితులు వేదయుక్తంగా జరిపించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

సత్యనారాయణ సేవలు మరువలేనివి

నంద్యాల(న్యూటౌన్): కార్మికుల హక్కుల సాధనకు సీఐటీయూ నాయకుడు పర్సా సత్యనారాయణ కృషి మరువలేనిదని సంఘం సీనియర్ నాయకుడు తోట మద్దులు కొనియాడారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సత్యనారాయణ 9వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కార్మికులకు గూడు, విద్య, వైద్యం కోసం అలుపెరగని పోరాటం చేశారన్నారు. గౌస్, పుల్లా నరసింహ, బాలవెంకట్, జైలాన్ పాల్గొన్నారు.

25న జిల్లా స్థాయి రగ్బీ జూనియర్ జట్ల ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 25 వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో అండర్-18 రగ్బీ క్రీడాంశంలో బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు రగ్బీ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006 నుంచి 2009 సంవత్సరాల మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన బాల బాలికలు రూ. 10 దరఖాస్తు రుసుం చెల్లించి నేరుగా ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతిభ కనబరచి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 31 వ తేదీన విశాఖపట్నం జిల్లా తిమ్మాపురం (బీమిలీ)లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం



చాగలమర్రి జూనియర్ కళాశాలకు నూతనంగా నిర్మించిన భవనం

చాగలమర్రి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 2024-2025 విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్-2ను మంజూరు చేసినట్లు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉత్తర్వులు విడుదల చేసిందని హెచ్‌ఎం ఎం.కోటయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 10 రోజుల క్రితం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో ఏవైనా 2 గ్రూపుల్లో అడ్మిషన్లు చేసుకోవటానికి అనుమతులు మంజూరయ్యాయని చెప్పారు. ఎక్కువ మంది విద్యార్థులు ఎంపీసీ, సీఈసీ గ్రూపులపై మక్కువ చూపుతున్నారని, అందుకే ఈ ఏడాది రెండు గ్రూపుల్లో ఒక్కో గ్రూపులో 40 మందికి ప్రవేశం కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు పాఠశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌లు 24 ఉండగా, హైస్కూల్ ప్లస్-2 విద్యా బోధనకు మరో 5 ఐఎఫ్‌పీ ప్యానెల్‌లను అదనంగా మంజూరు చేశారన్నారు. జూన్ 1వ తేదీ నుంచి ఇంటర్ తరగతులను ప్రారంభిస్తామని, స్థానిక విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇక్కడే అడ్మిషన్ పొందాలని సూచించారు. వివరాలకు సెల్ 9014196792, 9963532043 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కనుల పండువగా సత్యదేవుడి కల్యాణ ముహూర్తం



పసుపు దంచే కార్యక్రమం నిర్వహిస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కోటా వీధిలో వెలసిన శ్రీరమా సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్వామి, అమ్మవార్లకు పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తె ముహూర్తం వేడుకలను దేవస్థానం చైర్మన్ యాడికి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు, మంగళ స్నానాలు చేయించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. మహిళలచే పసుపుతో గౌరమ్మను తయారు చేసి ఒడియాల పిండి కార్యక్రమం చేపట్టారు. మరికొందరు పసుపును దంచి ఆలయ ఆవరణంలో మామిడి ఆకులతో తోరణాలు కట్టారు. చివరగా ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని వేదపండితుడు ప్రసన్నకుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో చేపట్టారు. యాడికి శ్రీదేవి, ఆలయ ఈఓ నాగప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన కల్యాణాన్ని ఉదయం 10గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. శిరీష, వెంకటసుబ్బమ్మ, స్వర్ణ, భూదేవి, సుధారాణి, వెంకటేశ్వర్లు, సత్యం పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఏపీఓ రవిప్రకాష్

ఉయ్యాలవాడ : జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తుందని ఏపీఓ రవిప్రకాష్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. సన్న, చిన్న కారు రైతులకు వంద శాతం సబ్సిడీ అందజేస్తుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండల పరిధిలో 100 ఎకరాలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారని చెప్పారు. జామ, మామిడి, మునగ, సపోట, డ్రాగన్ ఫ్రూట్స్, తదితర పండ్ల తోటల సాగుకు సంబంధించి మూడు సంవత్సరాల పాటు నిర్వహణకు సాగు చేసిన పంట రకాన్ని బట్టి ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.80 లక్షల వరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తుందన్నారు. కూలీలు పని చేసే ప్రదేశంలోనే మస్టర్ నమోదు, ఉపాధి సంబంధించిన 7 రకాల రిజిస్టర్లు నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వంద రోజుల పని దినాలకు సంబంధించి ఇప్పటి వరకు 64 శాతం పనులు కల్పించామని వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సింహవాహనంపై శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి



సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఉదయం ఆలయ పురోహితులు వెంకట్రామయ్య ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా రాత్రి 7 గంటలకు భక్త జన సందోహం మధ్య గరుడోత్సవం వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో ఈఓ ఏడీ వెంకటరమణ, ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముందస్తు ఖరీఫ్ పంటలు సాగు



హరినగరం సమీపంలో మిర్చి పంటలో కలుపు తొలగిస్తున్న కూలీలు



సుగాలి తండా వద్ద మొలక దశలో మినుము పైరు

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల్లో ముందస్తుగా ఖరీఫ్ పంటలు సాగుచేస్తున్నారు. రైతులు ఇప్పటికే మిర్చి పంట సాగు చేయగా అందులో కూలీల ద్వారా కలుపు తొలగింపు పనులు చేపట్టారు. పలు చోట్ల సాగు చేసిన మినుము మొలకదశలో ఉంది. ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు గత పంట వ్యర్థాలను తొలగించి ట్రాక్టర్లు,ఎద్దులతో సేద్యపు పనులు చేస్తున్నారు. ఆలమూరు,హరినగరం తదితర గ్రామాల రైతులు ముందస్తుగా మిర్చి పంట సాగు చేశారు. అలాగే నర్సాపురం,సుగాలి తండా, రుద్రవరం,టీ.లింగందిన్నె తదితర గ్రామాల రైతులు మినుము పంట సాగు చేశారు. జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయని, తద్వారా వర్షాలు బాగా కురుస్తాయనే ఆశ రైతుల్లో నెలకొంది.